


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

## -172-

(19 ఏప్రిల్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ఏ వృత్తికి సంబంధించిన** పరిభాష ఆ వృత్తికి ఏర్పడిపోయింది. ఆ పదాలు రానురాను భాషలో లీనమైపోతూ వుండటం సహజం. ఆయా వృత్తులతో పరిచయం గల వారికేకాక, ఇతరులక్కూడా అవి నిత్యకృత్యంలో వాడుక పదాలుగా ఆచరణలోకి వస్తాయి. పోస్టల్ పరిభాషకు సంబంధించిన వ్యాప్తి ఈ వ్యాసంలో వివరిస్తాను.

"అత్తయ్యా నువ్వు వూరు వెడుతున్నావుట. నేకూడా వస్తానే. నువ్వెడితే ఒక్కదాన్ని వుండలేను. నాకేం తోచదు. పైగా నేనా ఊరెప్పుడూ చూడలేదు" అంటూ ఏ మేనకోడలో వెంటపడడం సహజం.

అలాంటప్పుడు అత్తయ్య ఇలా చెపుతుంది "నువ్వెందుకమ్మా అంత దూరం అక్కడేమన్నా పెళ్ళా? ఒడుగా? ఒక్కసారి చూసివద్దామని బయలుదేరుతున్నాను. పైగా ఎండలు. నువ్వు ప్రయాణం చెయ్యలేవు తల్లీ. ఈసారి వెళ్ళినప్పుడు తీసుకువెడతాలే. చక్కగా ఒక వారం వుందాం" అని.

"ఇప్పుడే తీసుకు వెళ్ళు అత్తయ్యా. నువ్వు వెడితే దబ్బున రావు. నాకేమీ తోచదు" అని మేనకోడలి మారాం.

"నేనక్కడ కూర్చుంటాననుకుంటున్నావా? వెర్రిపిల్ల ఉండమన్నా వుండను. చూచిరావడమే రిప్లయి కార్డులాగా రివ్వున చక్కా వస్తా" ఆమె సమాధానం

ఇద్దరు మిత్రులు మరో మిత్రుని ప్రణయాన్ని గురించి మాట్లాడుకుంటున్నారు. "ఆ ప్రసాద్ చాలా తెలివిగల వాడురా. ఆ సుశీల మనస్సు ఇట్టే తిప్పేసుకున్నాడు. వాడి చాకచక్యం అనాలా! మరొకటా!" అని ఒకడు ఆశ్చర్యం ప్రకటించాడు.

రెండోవాడు వెంటనే ఇలా అన్నాడు. "వాడి ప్రేమేమిట్రా పాడు ప్రేమ. గుంభనాలేదు గుట్టూ లేదు. ప్రేమించడం ప్రారంభించేసరికే వూరంతా తెలిసింది. తెలియదు మరి? ఎక్కడ పడితే అక్కడ కలుసుకుంటారు. గందరగోళంగా మాట్లాడుకుంటారు. ప్రణయంలో రహస్యం రత్నకిరీటం లాటిదనే మాట పాటించరు. వట్టి బుక్‌పోస్టు ప్రణయం" లని రెండోవాడు విసుక్కున్నాడు.

మా బంధువుల్లో ఒకాయన వున్నాడు. ఆయన వచ్చినప్పుడు ఏవో బోలెడు విశేషాలు చెపుతాడని అందరూ ఆశపడేవారు. పైగా ఎన్నో ప్రశ్నలు వేసేవారు. అన్నీ నవ్వుతూ వినేవాడు చివరకు అన్నిటికీ కలిపి నాలుగు వాక్యాలలో జవాబు చెప్పి వూరుకునేవాడు.

"ఇంతేనా సంగతులు?" అని ప్రశ్నిస్తే

"అంతే" అని నవ్వి వూరుకునేవాడు. ఆ మాత్రం దానికి ఇంతదూరం రావాలా అని అందరికీ కోపం వచ్చేది. కానీ ఆయన్ని మార్చడం ఎవరికీ చేతకాలేదు.

అందరూ ఆలోచించి ఆయనకు "మని ఆర్డర్ కూపన్" అని పేరు పెట్టారు. అవును మరి ఆయనగారు చాలా ధనం గలవారు. అందరికీ కొద్దో గొప్పో సహాయపడుతూ వుండేవాడు. అందువల్ల ఆయన మాటలు కొద్దిగా మాట్లాడినా గౌరవం ఎక్కువ వుంటుంది.

మని ఆర్డర్ కూపనుకూడా మనియార్డరుతో పాటు వస్తుంది గనక దానికెంతో గౌరవం వుంటుంది. డబ్బు చేత్తో పుచ్చుకోగానే మనస్సు కొంచెం ఎయిర్ కండిషన్డ్ గా మారిపోతుంది. అప్పుడు చదివే మాటలు ఎంతో హాయిగా వుండటం కూడా సహజం. అందువల్ల తక్కువ మాటల పెద్ద మనిషికి "మనిఆర్డర్ కూపన్" అని పేరు పెట్టడం ఎంతో సహజంగా వుంది.

ఒకరు ఎవరి దగ్గరికైనా పోనీ ఏదో ఉద్యోగస్తుడి దగ్గరికే అనుకోండి. ఒక పనిమీద వెళ్ళి వస్తారనుకోండి. అలాటి సందర్భాలలో ఆయనగారేదో కాగితం ఇచ్చిరావడం, దానికి సంబంధించిన పనిచేసి పెట్టమని అడగడం జరుగుతూ వుంటుంది.

అలా వెళ్ళివచ్చానని మరొకరికి చెప్పినప్పుడు వెంటనే ఇలా అంటారు. "కవరు పడేసి వచ్చానన్నావు సరే బరువు ఎంతో తెలుసుకుని అంతకు సరిపోయే చీటీ అంటించావా? లేకపోతే వట్టిదే" అని.

ఈ భాషకు అర్ధం అవతల వాడి మామూలెంతో తెలుసుకుని అది వాడి చేతిలో పెట్టి వచ్చావా? అని అడగడం చీటీ అంటించడం అంటే, పని పూర్తవుతుందనే హామీ కల్పించుకుని రావడమని అర్ధం. మళ్ళీ అందంలో తక్కువ చీటీ అంటించకూడదు. అలా చేసినా పని అవుతుందనే ధీమా హుళుక్కే అని భావం.

ఒకరింట్లో ఆడపిల్లలుంటారనుకోండి. అందులో ఎందరికి పెళ్ళి అయిందో, ఎందరికి కాలేదో అనే వివరణ చెప్పవలసివచ్చినప్పుడు కూడా పోస్టల్ భాష వాడుతూ వుంటారు. ఆయనగారికి రూపాయి తపాలా బిళ్ళల్లాంటి ఆడపిల్లలు అయిదుగురున్నారు. అందులో ముగ్గురి ముఖాలు డెలివరీ ఆఫీసు స్టాంపులు పడ్డాయి. ఇంకా ఇద్దరికి పడాలి అంటూ వుంటారు.

మొన్న ఒకాయన తమ్ముడి కోసం ఒక పిల్లను చూసి వచ్చాడు. "పిల్ల చామన ఛాయిగా వుంది. సంబంధం కుదుర్చుకు వచ్చాం. మా వాళ్ళు మొదటినుంచి ఎర్రటి పిల్ల కావాలని పట్టుపట్టారు. కాని ఆ అమ్మాయిని చూడగానే కుళ్ళు కున్నాం. ఎందుకో తెలుసా! ఆ అమ్మాయివి చాలా పెద్ద కళ్ళు. ఎంత పెద్ద కళ్ళో తెలుసా? పాత పోస్టు బాక్సు తలంత వున్నాయి" అన్నాడు ఎంతో సంబర పడుతూ.

ఒకావిడ చాలా తికమకగా వుంటుంది సంసారంలో. అందుకని అప్పుడప్పుడు ప్రయాణాలు సాగిస్తూ వుంటుంది. ఎప్పుడు ఏ వూరు వెడుతుందో తెలియదు. ఒక్కతే బస్సెక్కి వెళ్ళిపోతుంది. పైగా చేరినట్లు ఉత్తరం వ్రాయడం ఆవిడకు అలవాటు లేదు. ఆవిడకు బుద్ధిపుట్టినప్పుడు తిరిగి రావడం ద్వారనే ఆవిడ సమాచారం తెలిసేది.

ఆవిణ్ణి గురించి చెప్పవలసి వచ్చినప్పుడు అంటూ వుంటారు "ఆవిడ బయలుదేరడం తెలుసుగాని, అవతల ఊరు చేరిందో లేదో ఎలా తెలుస్తుంది అన్ రిజిష్టర్డు పార్సెల్ లాగానే ఎంచుకోవాలి. తిరుగు రసీదు వగైరాలేమీ వుండవు" అని.

ఒక ఆడపిల్ల గల తండ్రి వరుణ్ణి వెదకడానికి బయల్దేరి వెళ్ళాడు ఒక కుర్రవాణ్ణి చూశాడు. నచ్చాడనిపించింది. కట్నం విషయం అడిగాడు. పదిహేను వేలు చెప్పారు. ఆయన ఖంగారుపడ్డాడు. పదివేలన్నాడు. వారు వల్లకాదన్నారు. పైగా అత్త కట్నం అర్ధ వేయి నూట పదహార్లు – ఆడపడుచుల కట్నాలు ఒక్కొక్కరికి రెండు నూట పదహార్లు చొప్పున అడిగారు.

పెళ్ళికూతురు తండ్రికి గుక్క తిరగలేదు. మళ్ళీ వస్తానని చెప్పి ఇవతలకు వచ్చాడు. ఇంటికి వచ్చి ఒక పెద్ద మనిషితో ఈ వృత్తాంతమంతా చెప్పి "కుర్రాడి కట్నం పెరగడం సరే అత్త, ఆడబిడ్డల రేట్లు కూడా అలా పెరిగితే ఎలాగండీ" అన్నాడట.

అది విన్న పెద్ద మనిషి పకపకా నవ్వి మీరు చాలా అమాయకుల్లాగా వున్నారు. "కవరు ఖరీదు పెరిగితే, కార్డు ఖరీదూ, పెరగదుటండి" అన్నాడట.

Post your comments